RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక



## ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి: ఏఐఎస్ఎఫ్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 22 (వార్త సంధ్య) :** కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టి, విద్యాసంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు తక్షణమే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేయాలని కోరారు. జిల్లాలోని పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. అలాగే విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ వస్తువులను పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే షాహిద్, జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోరిమి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో ఆకట్టుకున్న కవి సమ్మేళనం




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 22.** : తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో 83 వ రోజు సోమవారం నాడు పాల్కురికి సోమన్న మూల వేదికపై మడత భాస్కర్ నిర్వహణలో కపిల రాంకుమార్, గుడిపాటి, సామిడి జగన్ రెడ్డి, కోదాటి అరుణ, గన్నోజు ప్రసాద్, బండారు జయశ్రీ, ఇడికోజు శ్రీనివాసాచారి, తులసి వెంకట రమణాచార్యులు, ఆత్మీయ నిర్మల, పున్న అంజయ్య, బైతి దుర్గయ్య కొమ్ము వరలక్ష్మి, పగడాల నాగేందర్, పానుగంటి రాంమూర్తి, దేవినేని అరవింద రాముడు, దండమూడి శ్రీ చరణ్, యం.ఎస్.ఆర్. ప్రబోధ సుమేర్, గుడిపల్లి నిరంజన్, బుద్దారం రవి,లవణ్య సైదేశ్వర్, మల్యాల మనోహర్ రావు, దాసరి నరేందర్ రెడ్డి,మిద్దె సురేష్....తదితర కవులు తమ తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్, సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్, సలహాదారులు పల్లె నర్సింహ్మా, దినకర్ లు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించి సభకు ఉత్సాహభరితమైన వాతావరణాన్ని కల్పించారు. వారి ప్రదర్శనలు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను పొందాయి. కార్యమానికి విద్యానందాచారి, శ్రీనివాస్ రాజులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

## చీకటిమామిడి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**- స్టేట్ ఎండోమెంట్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

హైదరాబాద్, :జూన్– 22:(వార్త సంధ్య) : మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన మరియు దేవస్థానానికి సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోసం ఈరోజు దేవస్థానం కమిటీ సభ్యులు శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం గారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో స్టేట్ ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చీకటిమామిడి గ్రామ ప్రజలకు, పరిసర ప్రాంతాల భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆలయ ప్రాంగణ అభివృద్ధి, ప్రహరీ గోడ నిర్మాణం, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల, తాగునీటి వసతి, భక్తుల కోసం విశ్రాంతి గదులు, శాశ్వత మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే ఆలయంలో నిత్య పూజలు, ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందించాలని, దేవస్థానం ఆదాయ వనరులను పెంపొందించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా ఉన్న ఈ పురాతన ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు ఆధ్యాత్మిక సేవలు విస్తృతంగా అందేలా చూడాలని కోరారు. దేవస్థానం కమిటీ సభ్యులు ఆలయానికి సంబంధించిన సమస్యలను, అభివృద్ధి అవసరాలను వివరంగా కమిషనర్‌కు తెలియజేయగా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వాటి పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిని సానుకూలంగా స్వీకరించిన స్టేట్ ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు సంబంధిత అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.చీకటిమామిడి శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి చర్యకు మేము అండగా ఉంటాం. ఆలయ వైభవం పెరగడం ద్వారా గ్రామానికి మరింత ఆధ్యాత్మిక గుర్తింపు తీసుకురావడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జీడిమడ్ల సైదులు, మాజీ సర్పంచ్ పాలకూరి యాదయ్య గౌడ్, తాటికొండ సైదులు, సీనియర్ నాయకులు ఏరుకొండ అంజయ్య, జూలూరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు

## భార్య వేధింపుల కేసులో భర్తకు 3 ఏళ్ల జైలు శిక్ష




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 22:** భార్యను మానసికంగా, శారీరకంగా వేధించిన కేసులో భర్తకు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. పాల్వంచ మండలం మందేరికలపాడుకు చెందిన మిల్కాను ఆమె భర్త అజ్మీర్ మోహన్ అనుమానంతో తరచూ వేధించేవాడని కేసు నమోదైంది. ఈ వేధింపులు తట్టుకోలేక 2022 ఫిబ్రవరి 7న మిల్కా పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో 10 మంది సాక్షులను పరిశీలించిన కోర్టు, ఐపీసీ సెక్షన్ 498(ఏ) కింద నేరం రుజువైందని నిర్ధారించి అజ్మీర్ మోహన్‌కు 3 ఏళ్ల కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. అయితే ఐపీసీ సెక్షన్ 306 కింద నేరం రుజువుకాకపోవడంతో ఆ అభియోగం నుంచి విముక్తి కల్పించింది.

## వర్గీకరణ రోస్టర్ పాయింట్లు సవరణపై డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన మాల మహానాడు నేతలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 22 :** ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లపై మాలలకు జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మాల మహానాడు నేతలు ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు గ్రూప్ త్రీ లో ఉన్న మాల వర్గానికి కేటాయించిన ప్రస్తుత రోస్టర్ పాయింట్లను సవరించాలని గ్రూప్ 3 ప్రారంభ పోస్టర్ పాయింట్లు లోనే మాలలకు సముచిత ప్రాధాన్యం కల్పించే విధంగా రోస్టర్ లో సవరణ చేయాలని గ్రూప్ త్రీ వర్గానికి 16వ రోస్టర్ పాయింట్ లోపల అవకాశం కల్పించాలని వారు కోరారు ప్రస్తుతం ఉన్న విధానం వల్ల మాలలు విద్యా ఉద్యోగ అవకాశాలు పూర్తిగా కోల్పోతున్నారని బట్టికి నాయకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాలమహానాడు నేతలు గుంతేటి వీరభద్రం లింగాల రవికుమార్ దాసరి దానియేలు దామల సత్యం దాసరి శ్రీనివాస్ కొరివి భాస్కర్ కరాటే వేణు జమ్మి వీరబాబు కొట్టే నాగేంద్ర కుమార్ చింతమల్ల గురుమూర్తి కొప్పుల రామారావు నూకమల్ల రాజు మెట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి సహస్ర ఉన్నత విద్యకు శ్రీమాతా సేవ చారిటబుల్ సంస్థ అండ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 22 ( వార్త సంధ్య )కామారెడ్డి:** సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న శ్రీమాతా సేవ చారిటబుల్ సంస్థ, తన "నెలకు ఒక మంచి పని -- నెలకు ?100" నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను కోల్పోయి నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి సహస్ర విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించింది. కామారెడ్డి పట్టణంలోని ప్రియా టాకీస్ రోడ్ ప్రాంతానికి చెందిన సహస్రను శ్లోక ఇన్నోవేటివ్ స్కూల్‌లో 5వ






తరగతిలో చేర్పించి, ఆమె ఏడాది విద్యా ఖర్చులను భరించాలని సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా స్కూల్ ఫౌండర్ జాలిగామ శ్రీకాంత్ 50 శాతం ఫీజు మాఫీ చేసి చిన్నారికి అండగా నిలిచారు. ఇందుకు శ్రీమాతా సేవ చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాంత్ దత్త శ్లోక స్కూల్ , యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కే. సాయిరాం, ఆదీదీ న్యూస్ ప్రతినిధి శ్రీనివాస్, సిద్ధంశెట్టి వేణుగోపాల్, కే. శిరీష తదితరులు పాల్గొని సహస్రను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీకాంత్ మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేద విద్యార్థుల కోసం శ్రీమాతా సేవ చారిటబుల్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. సహస్ర విద్యలో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేలా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే చిన్నారికి పుస్తకాలు అందించిన మచ్చ నాగరాజు కుటుంబ సభ్యులకు, శ్లోక స్కూల్ యాజమాన్యానికి, నారాయణ సేవ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ శ్రీమాతా సేవ చారిటబుల్ సంస్థ తరఫున శ్రీకాంత్ దత్త హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్య క్రమంలో కామారెడ్డి ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పట్నంశెట్టి శ్రీనివాస్, కొడిప్యాక సాయిరాం, శిరీష, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత రాష్ట్రమే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయం: డీజీపీ సీవీ ఆనంద్

**మాదకద్రవ్యాల నుంచి పిల్లలను, దేశాన్ని రక్షించుకోవాలి**

**డ్రగ్స్‌కు అలవాటైన విద్యార్థులు ఉంటే విద్యాసంస్థలపై కఠిన చర్యలు**

**యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ అండ్ ఎగ్జిబిషన్ ఆఫ్ స్టాల్స్ ప్రారంభం**







**హైదరాబాద్, జూన్ 22 (వార్తా ప్రతినిధి):** డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్యేయమని, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో సోమవారం ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన "యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ అండ్ ఎగ్జిబిషన్ ఆఫ్ స్టాల్స్" కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సామాజిక సమస్య మాదకద్రవ్యాలేనని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జూన్ 26ను అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో జూన్ 22 నుంచి 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకప్పుడు భారత్ మాదకద్రవ్యాల రవాణాకు మార్గంగా మాత్రమే ఉండేదని, ప్రస్తుతం దేశంలోనే వాటి వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ముఖ్యంగా స్కూళ్లు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ సరఫరా జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని చిన్నారులు, యువత ఈ మత్తు పదార్థాల బారిన పడటం సమాజానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. కోవిడ్ అనంతరం దేశవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగం గణనీయంగా పెరిగిందని, ఇది కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించిందని చెప్పారు. వివిధ దేశాల నుంచి అక్రమ మార్గాల్లో దేశంలోకి చేరుతున్న మాదకద్రవ్యాలు పెద్ద నెట్‌వర్క్‌ల ద్వారా దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయని వెల్లడించారు. డ్రగ్స్ సమస్యలో డిమాండ్, సప్లై రెండూ కీలక అంశాలని, యువతలో డిమాండ్ లేకపోతే సరఫరా కూడా తగ్గిపోతుందని పేర్కొన్నారు. అందుకే విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.






### కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న డ్రగ్స్

డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తి జీవితం మాత్రమే కాకుండా మొత్తం కుటుంబం చిన్నాభిన్నమవుతుందని డీజీపీ అన్నారు. తాను అనేక కేసులు పరిశీలించిన సందర్భాల్లో పెద్ద పెద్ద వ్యాపారవేత్తల కుటుంబాలు కూడా ఈ సమస్యతో తీవ్రంగా నష్టపోయినట్లు చూశానని చెప్పారు. "వేల కోట్ల ఆస్తులు సంపాదించిన కుటుంబాల్లో కూడా పిల్లలు డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకున్న ఘటనలు ఉన్నాయి. డబ్బు సంపాదించడం మాత్రమే కాదు, పిల్లలపై నిరంతర పర్యవేక్షణ కూడా తల్లిదండ్రుల బాధ్యత" అని ఆయన అన్నారు.ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే బయటపడటం చాలా కష్టమని, కౌన్సెలింగ్, వైద్య చికిత్సలు చేసినప్పటికీ కొన్నిసార్లు పూర్తి స్థాయిలో కోలుకోవడం కష్టమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల శరీరంలోని కీలక అవయవాలు దెబ్బతిని తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలని, వారి స్నేహితులు, అలవాట్లు, రోజువారీ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న వయసులోనే మాదకద్రవ్యాల బారిన పడితే వారి భవిష్యత్తు పూర్తిగా దెబ్బతింటుందని అన్నారు.పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో తిరుగుతున్నారు, వారి ప్రవర్తనలో మార్పులు వస్తున్నాయా అనే అంశాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు.

### డ్రగ్స్ నిర్మూలనలో అందరి భాగస్వామ్యం అవసరం

డ్రగ్స్ నిర్మూలన కేవలం పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గల్లీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే డ్రగ్స్ నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు విమానాశ్రయాలు, చెక్‌పోస్టులు, రైల్వే మార్గాలు, సముద్ర మార్గాల వద్ద పటిష్ట నిఘా అవసరమని తెలిపారు. కస్టమ్స్, రెవెన్యూ ఇంటెలి జెన్స్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.

### విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విద్యాసంస్థల కోసం ప్రత్యేక నిబంధనలు తీసుకురానుందని డీజీపీ వెల్లడించారు. ప్రతి విద్యాసంస్థలో "యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీ" ఏర్పాటు తప్పనిసరి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులను స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించే సమయంలో తల్లిదండ్రుల నుంచి ప్రత్యేక డిక్లరేషన్ తీసుకునే విధానం అమలు చేయనున్నట్లు చెప్పారు. డ్రగ్స్ నిరోధంలో విద్యాసంస్థలు కూడా పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.విద్యాసంస్థలు ప్రత్యేక స్క్వాడ్స్ లేదా మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేసుకుని విద్యార్థుల ప్రవర్తనను పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటైన విద్యార్థులను ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్, పునరావాస చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

### గుర్తింపు రద్దు చేస్తాం

డ్రగ్స్ నియంత్రణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. ఒక విద్యాసంస్థ పరిధిలో విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడుతున్నా యాజమాన్యం తగిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ గుర్తింపును కూడా రద్దు చేసే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు.

### అవగాహన వారోత్సవాలు

"అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం–2026" సందర్భంగా జూన్ 22 నుంచి 26 వరకు మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా టీజీఐసీసీసీలో జూన్ 22 నుంచి 24 వరకు ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందులో ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ, షీ టీమ్స్, భరోసా, టాస్క్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, డీ–అడిక్షన్ సెంటర్లు, హైదరాబాద్ సిటీ పోలీస్ వెపన్స్ మరియు డాగ్ స్క్వాడ్ తదితర విభాగాలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ స్టాల్స్ ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, నివారణ చర్యలు, పునరావాస సేవలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు, భద్రతా వ్యవస్థల గురించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నారు.కార్యక్రమంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అజాజుద్దీన్ (ఐఆర్ఎస్), హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ కుందూరు ఎస్‌వీవీ ప్రసాద్ (ఐఆర్ఎస్), విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు. అనంతరం "సే నో టు డ్రగ్స్" అంశంపై అవగాహన గీతాన్ని రూపొందించిన సునీత కొరపాటిని డీజీపీ సీవీ ఆనంద్ సత్కరించి అభినందించారు.







## ఓటర్లు అయోమయానికి గురికావద్దు..

## ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా సమర్పించాలి: జీహెచ్ఎంసీ కమిషనర్ కన్నన్

**జూన్ 25 నుంచి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -2026పై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం**

**హైదరాబాద్, జూన్ 22 (వార్తా ప్రతినిధి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ కన్నన్ తెలిపారు. ఈరోజు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరికి ముందే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తామని, వాటిని పూర్తిగా నింపి సంతకం చేసి, ఇటీవల తీసిన ఒక ఫొటోను జతచేసి సంబంధిత బీఎల్వోకు తిరిగి ఇవ్వాలని సూచించారు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చే వ్యక్తి ఫొటో మాత్రమే జతచేయాలని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఫారాలు అందజేయబడతాయని తెలిపారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఎటువంటి అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. నూతనంగా ఓటరు నమోదు చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా లేదా ఫారం–6 నింపి బీఎల్వోలు, బీఎల్వో సూపర్‌వైజర్ల ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఎవరి ఓటు హక్కును అనవసరంగా తొలగించడం జరగదని, ఒకవేళ ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు తగిన సమయం, అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు జిల్లాల్లో లేదా రెండు నియోజకవర్గాల్లో లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదై ఉంటే వాటిని గుర్తించి ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్ ఓట్లను నివారించవచ్చన్నారు. ఎవరైనా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో నివసిస్తూ ఇక్కడ ఓటరుగా నమోదై ఉంటే, వారి పూర్వ రాష్ట్రంలో కూడా ఓటు ఉంటే ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ



నిర్లక్ష్యం చేయకుండా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సమర్పించాలని, లేకపోతే ఓటరు జాబితాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. బీఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు సరైన వివరాలతో ఫారం నింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

### మ్యాపింగ్ 46 శాతం పూర్తి

జీహెచ్ఎంసీ పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే 46.65 శాతం పూర్తయిందని కమిషనర్ తెలిపారు. మొత్తం 47,36,669 మంది ఓటర్లలో 22,09,647 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. మిగిలిన ప్రక్రియను త్వరలో పూర్తి చేసి 100 శాతం మ్యాపింగ్ సాధిస్తామని చెప్పారు.

### ఎస్ఐఆర్ -2026 ముఖ్య షెడ్యూల్

జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోల ఇంటింటి సందర్శన

జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు దావాలు, అభ్యంతరాల స్వీకరణ

### సెప్టెంబర్ 28 వరకు పరిష్కార ప్రక్రియ

### అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 4,062 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 47.36 లక్షల మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని కమిషనర్ కన్నన్ పేర్కొన్నారు.

